క్లుప్తంగా

రోడ్లు ఆక్రమిస్తే కఠిన చర్యలు



తెనాలి అర్బన్: రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ హెచ్చరించారు. స్వరాజ్ టాకీస్ సెంటర్ నుంచి బోసు రోడ్డు వరకు శుక్రవారం ఆయన పర్యటించారు. వ్యాపారులు రోడ్లపై ఆక్రమించి తమ సామగ్రి ఉంచడాన్ని గమనించి, వాటిని తొలగించాలని సూచించారు. ప్రజల సౌకార్యార్థం పట్టణంలో అనేక రోడ్లను అధికారులు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఇకపై వ్యాపారులు రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. టీపీవో సాంబశివరావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

వ్యాధి నిర్ధారణ కీలకం



తెనాలి అర్బన్: వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి సూచించారు. తెనాలి పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లతో శుక్రవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని తన కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాధ్యతతో పనిచేయాలని సూచించారు. పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సబ్ యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి, గుద్దంటి రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, షేక్ రషీద్, నవీద్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి డిపోనకు రూ.11.16 లక్షలు ఆదాయం



తెనాలి అర్బన్: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని గోవాడ, క్వారీ, శ్రీశైలం తదితర ప్రాంతాలకు అదనపు బస్సులను నడపడం వల్ల తెనాలి ఆర్టీసీ డిపోనకు రూ.11.16 లక్షల ఆదాయం లభించిందని డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. తెనాలి డిపో నుంచి క్వారీకి-30, గోవాడ -30, శ్రీశైలం-8, చెరుకుపల్లి, గోవాడకు అదనంగా మరో 2 బస్సులను నడిపినట్లు గుర్తుచేశారు. గత ఏడాది రూ.10.51 లక్షలు ఆదాయం వచ్చిందని గుర్తుచేశారు. గత ఏడాది 35,500 మంది సేవలు ఉపయోగించుకుంటే .. ఈసారి ఆ సంఖ్య 38,600కి చేరిందని చెప్పారు.

కౌన్సిలర్ల మాటకు విలువ లేదా?

- కౌన్సిల్ సమావేశంలో సభ్యుల అసహనం
- ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యంపై నిలదీత
- ఇంజినీరింగ్ వ్యవస్థ ప్రక్షాళనకు డిమాండ్



సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్లు



అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని.. టెండర్లు పిలిచి నెలలు దాటుతున్నా పనులు ప్రారంభం కావటం లేదని... కనీసం కౌన్సిలర్‌లు చెప్పిన ప్రజా సమస్యలను కూడా పరిష్కరించడం లేదని పలువురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభించి అజెండాలోని అయిదు అంశాలు చదివి ఆమోదించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య లేచి పినపాడు పార్కులో ఎన్నికల కోడ్ రాకముందు ప్రారంభించిన పనులు ఎందుకు ఆపేశారని అధికారులను ప్రశ్నించారు. పని ఎంతో అత్యవసరమని చెప్పినా ఎందుకు చేయటం లేదని అసహనం వ్యక్తం చేశారు. తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న జాప్యం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. సకాలంలో బిల్లులు రూపొందించటం లేదనే ఆరోపణ ఉన్నట్లు చెప్పారు. కాంట్రాక్టర్‌లు, ఇంజినీరింగ్ అధికారులతో పలుమార్లు సమీక్ష జరిపామని, 67 ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసిందని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. కొద్దిరోజుల్లో ఇంజినీరింగ్ విభాగంలో పూర్తి మార్పులు తెస్తామని హామీ ఇచ్చారు. కబేళా వంతెన వద్ద ఉన్న పడమర కాల్వకు ఫెన్సింగ్ లేకపోవడం వలన అనేక మంది దానిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని, ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.3 లక్షలు 15 నెలల క్రితం మున్సిపాలిటి మంజూరు చేసిందని, కానీ నేటిని పనులు ప్రారంభం కాలేదని 22వ వార్డు కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు తెలిపారు. చినరావూరు తోట గేటు వద్ద వర్షాకాలంలో నీరు నిలిచి పోతోందని, రోడ్డు ఏర్పాటు చేయాలని గతంలో కోరినట్లు 13వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కుర్రా సుజాత తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు రోడ్డు సగమే వేశారని, దాంతో ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కమిషనర్ రూ.10 లక్షలే రోడ్డుకు కేటాయించడం వలన సగం పనులు చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. మిగిలిన పనులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 4వ వార్డు, 26వ వార్డులలో కల్వర్టు నిర్మాణాలకు టెండర్లు పిలిచినా నేటికీ పనులు ప్రారంభించలేదని కౌన్సిలర్లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, షేక్ ఇస్మాయేల్‌లు తెలిపారు. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెనాలి పట్టణంలో రక్షిత మంచినీటి పథకం చాలా అస్తవ్యస్తంగా ఉందని, కుళాయి కనెక్షన్‌లు ఉన్న కొందరికి నీరు రావడం లేదని 17వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు తెలిపారు.పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోరారు. కౌన్సిలర్లు తెలియజేసిన అంశాలు నమోదు చేసుకున్నామని, అన్ని అంశాలను పరిష్కరించేలదా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, పలువురు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ముగింపు సమయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కొందరు కౌన్సిలర్లు తమ వార్డులోని సమస్యలు తెలియజేస్తూ ఉండగా, మిగతావారు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లారు. సమావేశం ముగిసే సమయానికి కనీసం 10 మంది కూడా అక్కడ కనిపించలేదు.

– తెనాలి అర్బన్

జాతీయ సైన్స్ దినోత్సవం



మాట్లాడుతున్న వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్



నమూనాలతో నెహ్రూనికేతన్ స్కూల్ విద్యార్థులు



మున్నంగి పాఠశాలలో నమూనాలతో విద్యార్థులు



తెనాలి టౌన్: ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్

తెనాలి అర్బన్/ తెనాలి రూరల్: శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిపై దేశ ప్రగతి ఆధారపడి ఉంటుందని వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీవీ రామన్ భారతీయులకు గర్వకారణంగా నిలిచారన్నారు. అధ్యాపకులు లక్ష్మీతిరుపతమ్మ, దేవీప్రియ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి అర్బన్: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఎండీ దాసరి మురళీకాంత్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ మణికాంత్ పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లోని స్కూల్‌లో విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం నాజ్‌నీన్ జిగర్, బ్రాంచ్-1 ప్రిన్సిపల్ రాము, పాల్గొన్నారు.

తెనాలి టౌన్: అసాధ్యాన్ని సుసాధ్యం చేసే ఆవిష్కరణలు సైన్స్‌కు సొంతమని కఠెవరం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం తాటి శ్రీధర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఎం.మదన్‌మోహన్, ఆర్.ధర్మారావు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

- కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నమూనాలు ఆకట్టుకున్నాయి. 9వ తరగతి విద్యార్థులు శ్యాముల్ పాల్, కాజా రోషన్ తయారు చేసిన చంద్రయాన్-3 వర్కింగ్ మోడల్‌కు హెచ్‌ఎం నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.
- గంగానమ్మపేటలోని శ్రీచైతన్య పాఠశాలలో సైన్స్ డేకి ముఖ్యఅతిథిగా శ్రీచైతన్య జూనియర్ కళాశాల సరస్వతి భవన్ ప్రిన్సిపల్ కొడాలి శ్రీనివాస్ హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ రాధ, ఏజీఎం అంజయ్య, ఆర్‌ఐ అప్పాజీ, లెక్చరర్ ప్రసాద్, డీన్ మల్లికార్జునరావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

మున్నంగి (కొల్లిపర): శాస్త్రవేత్తల కృషితోనే మనుగడ సాధ్యమవుతోందని ఉపాధ్యాయులు రాము, లక్ష్మికమల అన్నారు. మండలంలోని మున్నంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్)లో నమూనాల ప్రదర్శన నిర్వహించారు.



తెనాలి టౌన్: కొలకలూరు జెడ్పీ హైస్కూల్‌లో చంద్రయాన్-3 నమూనాతో విద్యార్థి

తెనాలిలో ఇంటర్ పరీక్షలకు 12 సెంటర్లు

తెనాలి అర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షలకు తెనాలి పట్టణంలో 12 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. శనివారం నుంచి 18వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు జరగనున్నాయి. పట్టణంలో వైష్ణవి జూనియర్ కళాశాల, ఎన్‌ఆర్ జూనియర్ కళాశాలలో-2, నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాలలు-2, వివేక కళాశాలలు-2, జేఎంజే మహిళా కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల, నారాయణ కళాశాల, విశ్వ జూనియర్ కళాశాలలను అధికారులు సెంటర్‌లుగా ప్రకటించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ఫ్యాన్లు, ఇతర సదుపాయాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

వైభవంగా రామేశ్వర స్వామి వసంతోత్సవం



తెనాలి టౌన్: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ రామేశ్వరస్వామి దేవస్థానం పాత శివాలయంలో శివరాత్రి మహోత్సవ ముగింపు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వామివారిని రథంపై సుందరంగా అలంకరించి మేళాతాళాలతో పురవీధుల్లో వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు దారి పొడవునా స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు దొడ్డక ఆదినారాయణ, రాంప్రసాద్, కారుమంచి శ్రీనివాసరావు, కోగంటి శివశంకరరావు, గుమ్మడి రవీంద్ర, నన్నపనేని బసవయ్య, శాస్త్రి, గుణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలూ అవసరం

తూములూరు (కొల్లిపర): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ అవసరం అని విద్యా కమిటీ మాజీ చైర్మన్ కొండా కిషోర్‌రెడ్డి, వింతా వేణుగోపాలరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తూములూరు గ్రామంలోని హైస్కూల్‌లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కె.నాగజ్యోతి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ డే సందర్భంగా శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించారు., దాతలు అందజేసిన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం. సూర్యప్రకాశరావు, సైన్స్ ఉపాధ్యాయులు రవికుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

9 కేంద్రాల్లో 70 శాతానికిపైగా పోలింగ్

- తెనాలి నియోజకవర్గంలో మొత్తం శాతం 68.91
- ఇదీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సరళి



కోగంటి శివయ్య హైస్కూలులో క్యూలైనులో ఓటర్లు

తెనాలి: కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెనాలి నియోజకవర్గంలో గురువారం జరిగిన పోలింగ్‌లో 68.91 శాతం ఓటింగ్ నమోదైంది. రెండు జిల్లాల్లో గల అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక పట్టభద్రుల ఓట్లు కలిగిన నియోజకవర్గాల్లో తెనాలి ఒకటి. ఇక్కడ 23,358 మంది ఓటర్లు ఉన్నారు. దాదాపు 70 శాతం అంటే 16,096 మంది ఓటు వేశారు. నియోజకవర్గంలో మొత్తం 29 పోలింగ్ కేంద్రాల్లోనూ రెండు మూడు కేంద్రాలను మినహాయిస్తే మిగిలిన అన్నింటిలోనూ 65 శాతంపైగానే ఓటింగ్ జరిగింది. అసెంబ్లీ సాధారణ ఎన్నికలతో పోటీగా తొమ్మిది పోలింగ్ కేంద్రాల్లో 70 శాతంపైగా ఓటింగ్ నమోదు కావటం గమనించాల్సిన అంశం. పట్టణంలోని ఆరు, కొల్లిపరలోని మూడు పోలింగ్ కేంద్రాల్లోనూ 70 శాతం పైగా ఓట్లు పోలయ్యాయి. కొల్లిపరలోని జిల్లా పరిషత్ హైస్కూలులో గల 314 పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 75.97 శాతం నమోదైంది. పట్టణ చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులోని 298 పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 62.16 శాతం మంది ఓటు వేశారు. కూటమి పార్టీల క్యాడర్ ప్రతి పోలింగ్ కేంద్రం దగ్గర మోహరించి, పట్టభద్రుల ఓట్లు ఎక్కువశాతం నమోదయ్యేలా చూశారు. కొన్నిచోట్ల ఓటుకు రాని వారి పేర్లను బయటకు తెప్పించుకుని, కూటమి పార్టీల క్యాడరే ఓట్లు వేసినట్టు పీడీఎఫ్ అభ్యర్థి తరపు నాయకులు ఆరోపించిన విషయం తెలిసిందే. పోటీలో ఉన్న కూటమి అభ్యర్థి సొంత నియోజకవర్గం కూడా కావటంతో తెనాలిలో ఆ పార్టీ క్యాడర్ సర్వశక్తులూ ఒడ్డింది. అందువల్లే 70 శాతం ఓటింగ్ నమోదైంది. వివిధ పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్ల వివరాలిలా ఉన్నాయి.

విద్యార్థులకు నిరంతర అభ్యాసం ముఖ్యం

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఫైనలియర్ విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

తెనాలి: సీనియర్ విద్యార్థులు నిరంతరం నేర్చుకోవాలని, తెలిసిన విషయాన్ని మిగతా విద్యార్థులతో పంచుకోవాలని ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో ఫార్మా-డీ విద్యార్థుల ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోదరభావంతో మెలుగుతూ సీనియర్లకు వీడ్కోలు పలకటం మంచి అనుభూతి ఇస్తుందన్నారు. హెల్త్ హాస్పిటల్ సీఈవో సీహెచ్ గిరిబాబు మాట్లాడుతూ నేటి సమాజంలో ఫార్మసిస్టులుగా రాణించడం సవాలుతో కూడుకున్నదని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ.. ఆదర్శ విలువలతో కూడిన జీవనవిధానం సాగించాలని కోరారు. అధ్యాపకుల నుంచి గ్రహించిన విలువలు సోపానాలుగా మలచుకొని పురోగమించాలని ఫార్మా-డీ హెచ్‌ఓడీ డాక్టర్ టి.జ్యోతిబసు సూచించారు. తొలుత కాలేజీ వ్యవస్థాపకుడు అన్నాబత్తుని సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఫార్మా-డీ విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి వాసికి టాప్ హెచ్‌ఆర్ లీడర్ అవార్డు


- దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 40 మందిలో ఒకరిగా గుర్తింపు
- రిక్రూట్‌మెంట్‌లో ఏఐని ప్రవేశపెట్టినందుకు దక్కిన గౌరవం




సురేష్‌దత్ త్రిపాఠి నుంచి అవార్డు స్వీకరిస్తున్న రూఫస్ రవికిరణ్

తెనాలి: మానవ వనరుల రంగంలో అసాధారణ నాయకత్వం, సహకార నైపుణ్యాలను ప్రదర్శించిన 40 ఏళ్లలోపు హెచ్‌ఆర్‌లకు ఎకనామిక్స్ టైమ్స్ వరల్డ్ ఎమర్జింగ్ లీడర్స్ లీగ్ (ఈటీహెచ్‌ఆర్) ప్రతిష్టాత్మక అవార్డును తెనాలికి చెందిన పులివర్తి రూఫస్ రవికిరణ్ స్వీకరించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 40 మంది భారత్‌లోని అత్యుత్తమ హెచ్ ఆర్ లీడర్లలో ఒకరుగా ఢిల్లీలో ఇటీవల జరిగిన ప్రత్యేక వేడుకలో ఎయిరిండియా లిమిటెడ్ చీఫ్ హెచ్‌ఆర్ అడ్వయిజర్ సురేష్‌దత్ త్రిపాఠి చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. హెచ్‌ఆర్ రిక్రూట్‌మెంట్‌లో కృత్రిమ మేధను వినియోగిస్తున్న ప్రతిభకు గాను రవికిరణ్ ఈ గౌరవాన్ని పొందటం విశేషం. రూఫస్ రవికిరణ్ ప్రస్తుతం చెన్నైలోని యునికో హౌసింగ్ ఫైనాన్స్‌లో వైస్‌ప్రెసిడెంట్-హెడ్ రిక్రూట్‌మెంట్‌గా చేస్తున్నారు. 2024 జనవరిలో ప్రారంభమైన ఈ సంస్థ ఏడాదిలోనే దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాలలో 85 శాఖలు, 650 మందికి పైగా ఉద్యోగులతో నడుస్తోంది. రిక్రూట్‌మెంట్ హెడ్‌గా రూఫస్ రవికిరణ్ ఈ సంస్థలో ఉద్యోగుల రిక్రూట్‌మెంట్‌లో వినూత్నంగా కృత్రిమమేధ (ఏఐ)ను ప్రవేశపెట్టారు. ఉద్యోగుల ఎంపికలో ఏఐ వినియోగంతో అభ్యర్థుల వాయిస్ ఆధారంగా వారి బిహేవియరల్ ఎసెస్‌మెంట్ చేస్తారు. ప్రిడిక్టివ్ ఎసెస్‌మెంట్ కూడా చేస్తామన్నారు. రూఫస్ రవికిరణ్ స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో పదో తరగతి వరకు చదివారు. గుంటూరు వికాస్ కాలేజీలో ఇంటర్మీడియట్ చేశారు. 2007లో చెన్నై వెళ్లి హెచ్‌ఆర్, సోషల్ వర్క్‌లో ఇండియాలోనే రెండో ర్యాంకులో ఉన్న ఎంఎస్ఎస్‌డబ్ల్యూ ఇన్‌స్టిట్యూట్‌లో హెచ్‌ఆర్ అండ్ ఐఆర్‌లో ఎంఎస్‌డబ్ల్యూ కోర్సును పూర్తి చేశారు. తర్వాత ఐటీ కంపెనీలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా, ఈక్విటాస్ బ్యాంక్ అండ్ టీవీఎస్ క్రెడిట్‌లో చేస్తూ మానవ వనరుల ఎంపికలో నవీన ధోరణలును ప్రవేశపెడుతూ వచ్చారు. ఆ క్రమంలోనే ప్రస్తుతం యునికో హౌసింగ్ ఫైనాన్స్‌లో వైస్‌ప్రెసిడెంట్, హెడ్ ఆఫ్ రిక్రూట్‌మెంట్ స్థాయికి ఎదిగారు. ఆయన తండ్రి చిట్టిబాబు రైల్వేలో చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్‌గా చేస్తూ, చీఫ్ బుకింగ్/గూడ్స్‌గా రిటైరయ్యారు. ప్రస్తుతం వీరు తెనాలి రూరల్ మండలం కఠెవరంలో నివసిస్తున్నారు. రూఫస్ రవికిరణ్ ఉద్యోగరీత్యా చెన్నైలో ఉంటున్నట్టు వివరించారు.


రామేశ్వరస్వామి ఆలయంలో ముగిసిన ఉత్సవాలు



శ్రీరామేశ్వరస్వామి



శ్రీపర్వతవర్ధని



ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహిస్తున్న దృశ్యం

తెనాలి: పట్టణంలోని గంగానమ్మపేటలో ప్రముఖ శ్రీపర్వతవర్ధనీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు ముగిశాయి. శుక్రవారం ఉదయం నిత్యపూజ, హోమ విధులు, గ్రామబలిహరణ, శ్రీస్వామి-అమ్మవార్లకు వసంతోత్సవంతో కార్యక్రమాలను ఆరంభించారు. అనంతరం వసంత మంటప సేవతో గ్రామోత్సవాన్ని జరిపారు. 10.30 గంటలకు త్రిశూల స్నానము, పూర్ణాహుతి, వేదాశీస్సులు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ధ్వజ అవరోహణం, మూకబలి, రాత్రి ఏడున్నర గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పుష్పయాగోత్సవంతో వేడుకలు ముగిశాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు భాగవతుల శివసుబ్రహ్మణ్యం, కన్నెగంటి భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రధాన ఆలయ వంశపారంపర్య అర్చకుడు పొత్తూరి వెంకట సురేష్ నిర్వహణలో జరిగిన వేడుకలను కార్యనిర్వహణాధికారి వీవీ రమణకుమారి పర్యవేక్షించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తెనాలి రూరల్: గుంటూరుకు చెందిన ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ సహకారంతో డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రూరల్ గ్రామం కొలకలూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.